# నేత్రదాన ప్రతిజ్ఞ తీసుకొమ్మని ప్రజలను కోరుతున్న ఎల్ వి ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ

**నివారించగల అంధత్వ నిర్మూలన దిశలో ఒక ప్రయత్నం**

***ఎల్విపిఇఐ-నేత్రదాన హెల్ప్ లైన్:*** 040-6810 2514/ 9849545822

నేత్రదాన ప్రాధాన్యత గురించి ప్రజలలో అవగాహన కల్పించడానికి మరియు మరణానంతరం నేత్రదానానికి ప్రజలు ప్రతిజ్ఞ చేసేటట్లు ప్రేరణ కలిగించడానికి ప్రతి సంవత్సరం ఆగస్ట్ 25 నుంచి సెప్టెంబర్ 8వరకూ జాతీయ నేత్రదాన పక్షోత్సవం జరుపబడుతుంది. సంవత్సరమంతా, ముఖ్యంగా ఈ పక్షంలో, ఎల్ వి ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ (ఎల్విపిఇఐ) తన వ్యవస్థ కేంద్రాలలో అంతటా ప్రజలలో నేత్రదానంపట్ల అవగాహన పెంచడానికి కార్యక్రమాల శృంఖలను నిర్వహిస్తున్నది. కార్నియా అంధత్వాన్ని పరిష్కరించడంలో నాణ్యమైన కార్నియా టిష్యూల లభ్యత అడ్డంకి ఉండకుండా చూసుకోవడమే లక్ష్యం.

భారతదేశంలో అంధత్వానికి కార్నియా వ్యాధి ఒక ముఖ్య కారణం. భారతదేశంలోని 10 మిలియన్ల అంధులలో 2 మిలియన్లకు పైగా భారతీయులు కార్నియా అంధత్వంతో ప్రభావితులయినవారు – అందులో 60% మంది 12 ఏళ్లలోపువారు. ఇది కార్నియా వ్యాధి, గాయం లేదా ఇన్ఫెక్షన్ కారణంగా కావచ్చు. కార్నియా అంధత్వానికి కార్నియా మార్పిడి మాత్రమే తెలిసిన చికిత్స. ఇది వ్యక్తులు తమ మరణానంతరం ఆరోగ్యకరమైన కార్నియాలు దానం చేయడంద్వారా సాధ్యమవుతుంది.

ఎల్విపిఇఐ హైదరాబాదులోని రామాయమ్మ అంతర్జాతీయ నేత్రనిధి భారతదేశంలో చూపు పునరుద్ధరించే కార్నియాలను అందించే అతిపెద్ద సంస్థ. ఇది కార్నియా మార్పిడికోసం వేచియుండే సమయాన్ని తగ్గించడంలో గణనీయంగా ప్రభావితం చేసింది మరియు 2019లో కార్నియా సేకరణలో ఒక లక్ష మార్కును దాటే మైలురాయిని సాధించింది. ఎల్విపిఇఐ వ్యవస్థలో కార్నియా మార్పిడులు చేయడానికి కార్నియాలను ఉపయోగించడానికి అదనంగా, సంస్థ ఎల్విపిఇఐ వ్యవస్థ వెలుపలి సర్జన్లకుకూడా కార్నియాలను పంపిణీ చేస్తుంది. గత సంవత్సరంలో భారతదేశంలో దృష్టి పునరుద్ధరించే కార్నియా మార్పిడి శస్త్రచికిత్సలకు పంపిణీచేసిన కార్నియాలలో 40% ఎల్విపిఇఐ వ్యవస్థ నేత్రనిధులు అందజేసాయి.

ఒక కార్నియా అంధత్వం ఉన్న వ్యక్తి చూపును పునరుద్ధరించడంలో కేవలం మరణించిన వ్యక్తి నేత్రదానం మాత్రమే సహాయపడగలదు. ప్రజలు తమ కళ్ళను దానంచేయకపోవడానికి కారణం అవగాహన లోపం, నేత్రదాన సంబంధితమైనఅపోహలు మరియు భయాలు. భారతదేశంలో ప్రస్తుత కార్నియా సేకరణ కార్నియా మార్పిడి

శస్త్రచికిత్స అవసరమైన రోగులలో కేవలం నాలుగింట ఒకవంతుమందికి మాత్రమే తీర్చగలుగుతున్నది. కార్నియా అంధత్వ పరిమాణం చాలా పెద్దది మరియు దేశంపై దాని ప్రతికూల ప్రభావం మరింత పెద్దది.

"ముందుకు వచ్చి, నేత్రదానానికి ప్రతిజ్ఞ చేయమని ప్రజలను మేము కోరుతున్నాము. ప్రతిజ్ఞ తీసుకున్న వ్యక్తి నేత్రదానం చేస్తాననే తన ప్రతిజ్ఞను మరియు నిశ్చయాన్ని తన కుటుంబ సభ్యులతో పంచుకోవడం మరియు తన మరణానంతరం దానికి అమలుపరచమని వారిని కోరడంకూడా అంతే ముఖ్యం. నేత్రదానం వ్యక్తి మరణం తరువాత, మరియు వారి కుటుంబసభ్యుల సమ్మతితో మాత్రమే జరగగలదు. కళ్ళను దానం చేయడంద్వారా మనం చూడలేని మరొకరికి చూపుని బహుమతిగా ఇవ్వగలుగుతాము, మరియు మరణించిన వ్యక్తి జ్ఞాపకాన్ని సజీవంగా ఉంచగలుగుతాము," అన్నారు డా సునీత చౌరాసియా, మెడికల్ డైరెక్టర్ – రామాయమ్మ అంతర్జాతీయ నేత్రనిధి, ఎల్ వి ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ.

## నేత్రనిధికి సంబంధించిన కొన్ని సాధారణ అపోహలు మరియు భయాలను ఛేదించడం:

**కోవిడ్ సమయంలో కళ్ళు దానం చెయ్యడం సురక్షితమేనా?**

అవును. అవసరమైన భద్రతా చర్యలు మరియు ఉత్తమ పద్ధతులను అనుసరిస్తే సురక్షితమే.

**ఎవరు కార్నియా దానం చేయవచ్చు?**

మరణానంతరం ఏ వయస్సువారైనా తమ నేత్రాలను దానం చేయవచ్చు. మధుమేహం, ఉబ్బసం, అధిక రక్తపోటు, కళ్ళద్దాలు పెట్టుకునేవారికి అదనంగా శుక్ల శస్త్రచికిత్స జరిగినవారుకూడా నేత్రదానం చేయవచ్చు.

**కోవిడ్ ఇన్ఫెక్షన్ వచ్చిన వ్యక్తి నేత్రదానం చేయవచ్చా?**

చేయవచ్చు. ఆ వ్యక్తి కోవిడ్ ఇన్ఫెక్షన్ నుంచి కోలుకున్నట్లయితే మరియు మరణ కారణం కోవిడ్ లేదా దాని జటిలతలు కాకపోతే నేత్రదానం చేయవచ్చు.

**కార్నియా సేకరించడానికి పూర్తి కన్ను తీయబడుతుందా?**

లేదు. ఐరిస్ కి ముందుండే కార్నియా అనబడే పారదర్శక పొర తీయబడుతుంది. కన్నుగుడ్డు చెక్కుచెదరకుండా ఉంటుంది.

**కళ్ళు దానం చెయ్యడంవలన ముఖం వికృతం అవుతుందా?**

కనుగుడ్డు చెక్కుచెదరకుండా ఉండటంవలన కార్నియా తొలగించిన తరువాతకూడా, కార్నియా తొలగించడం ముఖాన్ని ఏవిధంగానూ వికృతం చేయదు.

**మరణం తరువాత ఎంత త్వరగా కార్నియాలను తొలగించాలి?**

మరణం తరువాతి 9 గంటలలోపల కార్నియాలను తొలగించాలి.

**నేత్రదానానికి మృతుడిని / దాతను ఆసుపత్రికి తీసుకువెళ్లవలసి ఉంటుందా?**

నేత్రనిధి బృందం దాత ఇంటికి లేదా ఆసుపత్రికి (మరణం సంభవించిన స్థానం) వెళతారు మరియు కార్నియా ఎక్సిషన్ (తొలగింపు) చేస్తారు.

**గ్రహీత గుర్తింపు దాత కుటుంబానికి తెలుస్తుందా?**

తెలియదు. దాత-గ్రహీత సమాచారం ఖచ్చితంగా గోప్యంగా ఉంచుతారు.

**దాత కుటుంబం ఏదైనా రుసుము పొందుతారా?**

లేదు. మానవ నేత్రాలు, అవయవాలు లేదా టిష్యూలను అమ్మడం లేదా కొనడం చట్టవిరుద్ధం. కార్నియా సేకరణ మొత్తం ఖర్చును నేత్రనిధి భరిస్తుంది.

**నేత్రదానాన్ని మతాధికారులు సమ్మతిస్తారా?**

అవును, అన్ని మతాలూ దీనిని సమర్ధిస్తాయి.

**కార్నియా మార్పిడికి అన్ని కార్నియాలూ సరిపోతాయా?**

ఎయిడ్స్, పచ్చకామెర్లు, రేబిస్, సిఫిలిస్, ధనుర్వాతం (టెటనస్), సెప్టిసెమియా మరియు వైరల్ వ్యాధితో బాధపడినవారి కార్నియాలు మార్పిడికి పనికిరానివిగా పరిగణిస్తారు.

**సంభావ్య దాతలను అంటువ్యాధులకు పరీక్షిస్తారా?**

అవును, అంటువ్యాధులులేని దాతల కార్నియాలను మాత్రమే మార్పిడికి ఉపయోగిస్తారు.

**శస్త్రచికిత్సకు ఉపయోగించని కార్నియాలను ఏమి చేస్తారు?**

ఈ కార్నియాలను కంటి వ్యాధులపై పరిశోధనకు మరియు కంటి శస్త్రచికిత్సల సంబంధిత శస్త్రచికిత్సా శిక్షణకు ఉపయోగిస్తారు.

**కార్నియా అంధత్వం:** కార్నియా పారదర్శకంగా ఉన్నంతవరకు దానిద్వారా కాంతి ప్రసరించగలదు, వ్యక్తి చూడగలుగుతారు. కొన్నిసార్లు కార్నియా అపారదర్శకం లేదా మసకబారుతుంది (దెబ్బతిన్నప్పుడు) లేదా ఘాతం, ఇన్ఫెక్షన్ లేదా ఇతర వ్యాధుల తరువాత దాని పారదర్శకత కోల్పోతుంది. అపారదర్శక కార్నియా ఉన్న వ్యక్తి చూడలేరు. ఈ స్థితిని కార్నియా అంధత్వం అంటారు.

**కార్నియా మార్పిడి:** కార్నియా అంధత్వం ఉన్న వ్యక్తి కార్నియా మార్పిడి అనే ఒక శస్త్రచికిత్స ప్రక్రియద్వారా తిరిగి చూడగలుగుతారు. ఇందులో దెబ్బతిన్న కార్నియాను ఒక మరణించిన దాతనుంచి సేకరించిన ఆరోగ్యవంతమైన కార్నియాతో మార్పిడి చేస్తారు.

**ఎల్విపిఇఐ నేత్రనిధి వ్యవస్థ:** హైదరాబాదు ప్రాంగణంలో ఉన్న నేత్రనిధికి అదనంగా ఎల్విపిఇఐకి భుబనేశ్వర్, విశాఖపట్నం మరియు విజయవాడ ప్రాంగణాలలో కూడా నేత్రనిధులు ఉన్నాయి. ఎల్విపిఇఐలో కార్నియా సేకరణ మరణించినవారి కుటుంబాలచే స్వచ్చందంగా విరాళాలు, భాగస్వామ్య కేంద్రాలు మరియు హాస్పిటల్ కార్నియా రిట్రీవల్ ప్రోగ్రాం (హెచ్సిఆర్పి) ద్వారా జరుగుతుంది. హెచ్సిఆర్పిలో మల్టీ-డిసిప్లినరీ ఆసుపత్రులలో ఒక నేత్రదాన కౌన్సిలరును ఉంచుతారు. కౌన్సిలర్ నేత్రదానానికి మరణించినవారి అర్హతను వైద్య ప్రాతిపదికన పరీక్షించి, నేత్రదానానికి మృతుడి కుటుంబాన్ని సంప్రదించి, వారిని ప్రేరేపిస్తారు.

**ఎల్ వి ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ:** 1987 సంవత్సరంలో స్థాపించబడిన, అంధత్వ నివారణకై ప్రపంచ ఆరోగ్య సంస్థ సహకార కేంద్రమయిన ఎల్ వి ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ (ఎల్విపిఇఐ) ఒక సమగ్ర నేత్ర ఆరోగ్య సౌకర్యం. తన కార్యనిర్వహణకై ఎల్విపిఇఐలో పది క్రియాశీల విభాగాలున్నాయి – వైద్య సేవలు; విద్య; పరిశోధన; దృష్టి పునరావాసం; గ్రామీణ మరియు సామాజిక నేత్ర ఆరోగ్యం; నేత్రనిధి; అనుకూలవాదన మరియు విధాన ప్రణాళిక; సామర్థ్య నిర్మాణం; ఆవిష్కరణ మరియు ఉత్పాదన అభివృద్ధి. ఎల్విపిఇఐ నేత్ర సంరక్షణా వ్యవస్థలో భారతదేశంలోని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిషా మరియు కర్ణాటక రాష్ట్రాలలో విస్తరించిన 236 కేంద్రాలున్నాయి. సమాజంలోని అన్ని వర్గాలకీ సమానమైన మరియు నాణ్యమైన నేత్ర సంరక్షణ అందజేయడం సంస్థ లక్ష్యం.గ్రామాలనుంచి నగరంవరకూ సమాజంలోని అన్ని వర్గాలనూ ఆవరిస్తున్న ఎల్విపిఇఐ ఐదు-శ్రేణుల 'నేత్ర ఆరోగ్య పిరమిడ్' నమూనా ఉన్నతమైన నాణ్యతగల మరియు సమగ్రమైన – నివారణ, చికిత్స మరియు పునరావాసం – నేత్ర సంరక్షణ అందరికీ అందిస్తున్నది. ఇది 3 కోట్ల 21 లక్షలకు పైగా ప్రజలకు సేవచేసింది. అవసరమైన సంరక్షణ క్లిష్టతతో సంబంధంలేకుండా అందులో 50% పూర్తిగా ఉచితం.